## క్లుప్తంగా

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం


రాంచందర్‌రావును సన్మానిస్తున్న బీజేపీ నేతలు

షాద్‌నగర్: బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన రాంచందర్‌రావును శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాంచందర్‌రావును శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర నాయకులు వంశీకృష్ణ, మచ్చ సుధాకర్‌రావు, ఓబీసీ మోర్చా నాయకులు మల్చలం మురళి, శ్రీనివాసాచారి, గిరిజన మోర్చా నాయకుడు వినోద్ కుమార్, గజ్జల ప్రవీణ్ పాల్గొన్నారు.

### ఉపాధ్యాయుడిపై అభిమానంతో ..

విద్యార్థులకు షూ పంపిణీ


విద్యార్థులకు షూ అందజేస్తున్న దాతలు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం ఇంద్రానగర్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెద్ద రేవల్లి గ్రామస్తుడురాజ్‌కుమార్ శుక్రవారం షూ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు విద్యా బోధన చేసిన ఉపాధ్యాయులు ప్రకాశ్ ప్రస్తుతం ఇంద్రానగర్ పాఠశాలలో పనిచేస్తున్నారని.. తనపై అభిమానంతో విద్యార్థులకు షూ అందజేస్తున్నాని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశా ల హెచ్‌ఎం ఉదయ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించాలి

బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ


తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

నందిగామ: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలువురు శుక్రవారం స్థానిక తహసీల్దార్ రాజేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 26 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలలో సుమారు 22 లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వీరిలో 80 శాతం మంది విద్యార్థులు పాఠశాలలకు దూరంగా నివాసం ఉంటున్నారని అలాంటి వారికి ఇబ్బందులు కల్గుతున్నాయని చెప్పారు. ప్రతీ 30 మంది విద్యార్థులకు ఒక బస్సు చొప్పున బస్సులను ఏర్పాటు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. లాలయ్య, అహ్మద్ పాషా, శ్రీనివాస్, భాస్కర్, శ్రీకాంత్, యాదగిరి, అశోక్, నర్సింహ, దాసు, మల్లేష్, శ్రీశైలం, చెన్నయ్య, రాఘవేందర్, రవీంద్ర పాల్గొన్నారు.

### ప్రజాభాగస్వామ్యమే ప్రధానం

కార్పొరేటర్ శ్రీవాణి



అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్‌తో చర్చిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి

హుడాకాంప్లెక్స్: అభివృద్ధి పనులలో ప్రజల భాగస్వామ్యం ఉంటే ఆ పనులు త్వరగా పూర్తి అవుతాయని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అన్నారు. శుక్రవారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌పాటిల్‌ని ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు. డివిజన్‌లో చేపట్టాల్సిన కీలక అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చించారు. ప్రధానంగా సీఎం రోడ్డు విస్తరణ పనులు జోనల్ కమిషనర్‌తో చర్చించడం జరిగిందని కార్పొరేటర్ తెలిపారు. సీఎం రోడ్డు విస్తరణ, 50 అడుగులా 60 అడుగులా, లేదా 80, 100 అడుగుల విస్తరణ కావాలా అనే అంశంపై స్పష్టత కోరారు. సరూర్‌నగర్ చౌడీ సర్కిల్ బ్యూటిఫికేషన్–పాత భవనం ప్రమాదకర స్థితికి చేరింది. భవనం ఎప్పుడెప్పుడు కూలిపోతుందో అన్న భయంతో స్థానికుల్లో నెలకొందని, అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

# బీసీ రిజర్వేషన్ పెంపు హర్షణీయం


షాద్‌నగర్ రూరల్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్


మొయినాబాద్: మాట్లాడుతున్న భీంభరత్

• ఎమ్మెల్యే వీర్లపల్లిశంకర్

షాద్‌నగర్ రూరల్: బీసీలకు రిజర్వేషన్లను పెంచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం కోటా కేటాయించేందుకు కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం పార్టీ, బీసీ సేన ఆధ్వర్యంలో ముఖ్య కూడలిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి సంబురాలు జరుపుకొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీసీల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. బీసీలకు రాజ్యాధికారాన్ని అందించడమే ప్రభుత్వం లక్ష్యమని చెప్పారు. కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని సీఎం రేవంత్‌రెడ్డి అమలు చేశారని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో రెండు శాతం ఉన్నవారు దేశాన్ని, ఏడు శాతం ఉన్నవారు ఉమ్మడి రాష్ట్రాన్ని, ఐదు శాతం ఉన్నవారు తెలంగాణను పాలించారని, ఇది రాజకీయ అసమానతలకు,అన్యాయాలకు నిదర్శనమని గుర్తు చేశారు. బీసీల రిజర్వేషన్‌పై ఎమ్మెల్సీ కవిత కాంగ్రెస్ పార్టీని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో కవిత బీసీ రిజర్వేషన్‌పై ఎందుకు మాట్లాడలేదని సమాధానం చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ బీసీలపై చిత్తశుద్ధితో ఉందని, బీసీలకు రాజ్యాధికారాన్ని అందించేందుకు ఆర్.కృష్ణయ్య, బీసీ నాయకులతో చర్చించడం జరిగిందని అన్నారు. నియోజకవర్గంలో బీసీ సేన నాయకులు, మహిళా నాయకురాళ్లు బీసీల చైతన్యానికి చేస్తున్న కృషిని అభినందించారు. రిజర్వేషన్ల కోసం కృషి చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షుడు చంద్రశేఖర్, బీసీసేన నాయకులు చంద్రశేఖరప్ప, వరలక్ష్మి, జలజ, భాగ్యలక్ష్మి, స్రవంతిరాజ్, రమేష్, సరస్వతి, అనురాధ, అరుణ, సౌజన్య, వసంత, మమత, సింధూర, నాగమణి, శంకర్, సుదర్శన్, వెంకటేష్, చంద్రశేఖర్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు

**రాబోయేది బీసీల రాజ్యమే**

మొయినాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలపడం హర్షనీయమని కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీష్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ చౌరస్తాలో ఉన్న భీంభరత్ నివాసంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేస్తూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపి ఆర్డినెన్స్ తీసుకొచ్చిందన్నారు. ఇది ఏఐసీసీ నేత రాహుల్ గాంధీ ఆలోచన విధానానికి, కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. గతంలో బీసీలకు ఉన్న 33 శాతం రిజర్వేషన్లను బీఆర్‌ఎస్ పార్టీ 27 శాతానికి తగ్గించి బీసీలను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని.. ఆ దిశగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాపాలన సాగుతుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపుతో సాంకేతిక సమస్యలు తలెత్తకుండా అధ్యయనం చేసి తమిళనాడు తరహా 9వ షెడ్యూల్ ప్రకారం రిజర్వేషన్లు అమలు చేస్తుందన్నారు. రిజర్వేషన్ల పెంపుతో తెలంగాణ రాష్ట్రంలో రాబోయేది బీసీల రాజ్యమేనన్నారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాణయ్య, మాజీ సర్పంచ్‌లు వీరభద్రస్వామి, సత్యనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యులు గణేష్‌గౌడ్, మాధవరెడ్డి, నాయకులు కరణ్, నిరంజన్‌గౌడ్, భాస్కర్, కుమార్, మినాజుద్దీన్, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# వెంచర్లలో చెత్త తొలగింపు


మేకగూడలోని వెంచర్‌లో చెత్త తొలగింపు పనులు

సాక్షి ఎఫెక్ట్..

నందిగామ: ఎట్టకేలకు పారిశుద్ధ్య సమస్యపై అధికారులు స్పందించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన డంపింగ్, కంపోస్టు యార్డులు నిరుపయోగంగా ఉన్నాయని.. చెత్తను వెంచర్లు, వాగులు, వంకల్లో వేస్తున్నారని ఈ నెల 10న ‘సాక్షి’దినపత్రికలో ‘ఆలోచన ఘనం.. ఆచరణ శూన్యం’శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన అధికారులు శుక్రవారం ఎంపీఓ తేజా సింగ్, మేకగూడ పంచాయతీ కార్యదర్శి రాంచందర్, రంగాపూర్ పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ ఆయా గ్రామాలను సందర్శించారు. మేకగూడ శివారులోని వెంచర్‌లో చెత్తను తొలగించారు. రంగాపూర్‌లో పారిశుద్ధ్య సిబ్బందితో డంపింగ్ యార్డు పరిసర ప్రాంతాల్లోని చెత్త డంపింగ్ యార్డులో వేయించారు. ఈ సందర్భంగా ఎంపీఓ తేజా సింగ్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామన్నారు.

# ఓటరు జాబితాలో తప్పులుండొద్దు

• షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్


బీఎల్‌ఓల శిక్షణ శిబిరానికి హాజరైన తహసీల్దార్

షాబాద్: ఓటరు జాబితాలో తప్పులుండొద్దని షాబాద్ తహసీల్దార్ ఎండీ అన్వర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ లెవల్ అధికారులు ప్రతి ఇంటినీ సందర్శించి ఓటర్ల వివరాలను పరిశీలించాలని, మార్పులు చేర్పులపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటు హక్కు కలిగి చిరునామా మారిన వారిని గుర్తించడం, దివ్యాంగులు, వృద్ధులు పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునేలా సహాయపడడం, ఎన్నికల నియమావళిపై బూత్‌స్థాయి అధికారులకు పరీక్ష నిర్వహించారు. 18 ఏళ్ల వారికి ఓటుహక్కు కల్పించడం, పోలింగ్ బూత్‌లో బూత్‌స్థాయి ఏజెంట్లతో సమన్వయం కలిగి ఉండాలని చెప్పారు. ఫారం 6, 7, 8 నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఓటరు జాబితాలో అవసరం ఉన్న చోట పాత ఫొటోలను తొలగించి కొత్తవాటిని అప్‌లోడ్ చేయాలన్నారు. పేర్లలో తప్పులను సవరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కుటుంబ సభ్యులంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చూడాలన్నారు. మరణించిన వారి పేర్లను తొలగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు, మాస్టర్ ట్రైనర్లు ఆశీర్వాదం, అక్బర్, రోషన్ బాలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి భరోసా

• చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య


చేవెళ్ల: సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు

చేవెళ్ల: అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న పేదలకు కాంగ్రెస్ ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్‌తో అండగా నిలుస్తోందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే 52 మంది బాధిత కుటుంబ సభ్యులకు చెక్కులు పంపిణీ చేశారు. గోరిబీ, మహ్మద్‌గౌస్‌కు రూ.5 లక్షల ఎల్‌ఓసీ అందజేశారు. కులాంతర వివా హం చేసుకున్న ప్రేమ జంటకు రూ.2.50 లక్ష ల చెక్కు అందజేశారు.అనంతరం కాలె యాద య్య మాట్లాడుతూ..నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమానికి కృషి చేస్తున్నానన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ నాయకులు**

మొయినాబాద్: మండల పరిధిలోని చాకలిగూడకు చెందిన బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం చేవెళ్లలో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్ ఆధ్వర్యంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకొన్నారు. ఎమ్మెల్యే యాదయ్య వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. పార్టీలో చేరినవారిలో బీజేపీ ఓబీసీ మోర్చా మండల మాజీ ప్రధాన కార్యదర్శి కమ్మెట కుమార్‌యాదవ్, నాయకులు ప్రవీణ్‌యాదవ్, నవీన్‌యాదవ్, రమేష్ యాదవ్, వేణుయాదవ్, ఆనంద్‌యాదవ్, కొమరయ్య, సురంగల్‌కు చెందిన యాదగిరిచారి ఉన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు షాబాద్ దర్శన్, నాయకులు రాజుగౌడ్, రాజేష్‌గౌడ్, మొమిన్‌పాషా, కలీల్ పాష, అలీమ్, రజినీకాంత్ గౌడ్, గిరీష్‌యదవ్ తదితరులు పాల్గొన్నారు.


కేశంపేట: ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది


షాబాద్: చందనవెల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో..

# జనాభా నియంత్రణతోనే ఆర్థికాభివృద్ధి

చందనవెల్లి పీహెచ్‌ఎసీ డాక్టర్ ప్రణీత్

షాబాద్: జనాభా నియంత్రతోనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని చందనవెల్లి పీహెచ్‌సీ డాక్టర్ ప్రణీత్ అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నీలారాణి, ఫార్మసిస్ట్ నవీన్, హెల్త్ అసిస్టెంట్ గోపాల్, వైద్య సిబ్బంది నవీన్, శ్రీలత, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

**కేశంపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో..**

కేశంపేట: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత అధ్వర్యంలో సిబ్బంది ర్యాలీని నిర్వహించారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ నర్సింహారెడ్డి, అంజిలమ్మ, సంతోష, వీణ, కృష్ణవేణి పాల్గొన్నారు.

**‘మేరా యువ భారత్ రంగారెడ్డి జిల్లా’ ఆధ్వర్యంలో**

నందిగామ: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా నందిగామ జెడ్పీహెచ్‌ఎస్‌లో ‘మేరా యువ భారత్ రంగారెడ్డి జిల్లా’ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, పేయింటింగ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీడీఓ సుమతి మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్ననాటి నుంచే అన్ని విషయాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుధాకర్, ఎస్‌ఐ దేవరాజ్, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, మేరా భారత్ ప్రతినిధి శ్రీశైలం, నవతేజ యూత్ సభ్యులు చంద్రశేఖర్, మధు, వంశీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న లావణ్య

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల ప్రణాళికలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ.. కార్మికులు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో యూజీడీ, తాగునీటి పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు మాధవి, చంద్రకళ, నర్సింహగౌడ్, అనిత, సోమ్లా నాయక్, మండల వైద్యాధికారి డాక్టర్ రాజేశ్, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ డాక్టర్ నగేశ్, గణేశ్, శంకరయ్య గౌడ్, రమేశ్, ఎండీ విస్కీన్, సురేశ్, రమేశ్, అబ్దుల్‌ఘని, సతీశ్, మంగ తదితరులు పాల్గొన్నారు.

### ఎనికేపల్లి రైతులకు న్యాయం చేయాలి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింలు

మొయినాబాద్: గోశాల ఏర్పాటుతో భూములు కోల్పోతున్న ఎనికేపల్లి రైతులకు ప్రభుత్వం న్యాయం చేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు డిమాండ్ చేశారు. మున్సిపల్ పరిధిలోని ఎనికేపల్లి గోశాలకు కేటాయించిన భూముల వద్ద ధర్నా చేస్తున్న రైతులకు శుక్రవారం టీడీపీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు పరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం భూములు తీసుకోవడం సరికాదన్నారు. తాతల కాలం నుంచి సాగుచేసుకుంటున్న భుములపై రైతులకే హక్కులు కల్పిస్తూ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, యాదయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### నేడు ఎమ్మెల్సీ కవిత రాక

కేశంపేట: మండల పరిధిలోని కాకునూర్ గ్రామానికి జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శనివారం విచ్చేయనున్నట్లు బీఆర్‌ఎస్ నాయకుడు సీమల రమేష్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు మహిళలకు నెలకు రూ.2,500 ఇస్తామని హామీ ఇచ్చి మరిచిందని.. ఇదే అంశంపై ఆమె స్థానిక మహిళలతో కలిసి పోస్టు కార్డు నిరసన తెలపనున్నట్లు వివరించారు. మహిళలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

### చట్ట సభల్లోకి అగ్రకులాలు.. స్థానిక సభలకు బీసీలు

బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామని చెప్పిన 42శాతం రిజర్వేషన్లతో బీసీలు స్థానిక సభలకు మాత్రమే వెళ్లగలరని.. చట్ట సభలకు వెళ్లలేరని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ తెచ్చిన రిజర్వేషన్లతో బీసీలు తమ నాయకులను పార్లమెంట్, అసెంబ్లీకు పంపగలరా, చట్టాలు చేయగలరా అని ప్రశ్నించారు. చట్టాలు చేయలేని రిజర్వేషన్లను బీసీల ముందుకు తెచ్చి మరోమారు మోసం చేస్తుందన్నారు. ఈ రిజర్వేషన్‌తో వచ్చే సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ పోస్టులు జిల్లా కలెక్టర్ తొలగిస్తే పోయే పోస్టులని, అధికారులు తొలగిస్తే పోయే పదవుల వలన బీసీలకు ఏ విధంగా న్యాయం జరుగుతుందో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌లు అంతర్గతంగా కుమ్మక్కై, బీసీలను నష్టపరిచే విధానాలను అమలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ బీసీలను మోసం చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా బీసీలు కళ్లు తెరిచి అగ్రకులపార్టీ మోసాలను తిప్పి కొట్టాలని, బీఎస్పీ పార్టీతో కలిసి రావాలని పిలుపునిచ్చారు.



# పర్యావరణాన్ని పరిరక్షించాలి

• ఎంపీడీఓ సంధ్య


అమ్డాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మొక్క నాటుతున్న ఎంపీడీఓ సంధ్య

మొయినాబాద్‌రూరల్: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంపీడీఓ సంధ్య అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అమ్డాపూర్ ప్రాథమిక, జెడ్పీహెచ్‌ఎస్‌లో వన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ సంధ్య, విశ్వకర్మసంఘం మండల అధ్యక్షుడు నర్సింహాచారి హాజరై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రేణుక, నరేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కవిత, పశువైద్యాధి కారి దేవీరెడ్డి, శేఖర్‌రెడ్డి, అబ్దుల్ అమీద్, బందయ్య, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

• డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి


షాద్‌నగర్‌రూరల్: జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్: పోషకాహారాన్ని తీసుకుంటే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సునీత ఆధ్వర్యంలో సిబ్బందికి ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్‌లో పని చేస్తున్న ఆర్పీలు, సిబ్బందికి బ్రెస్ట్ క్యాన్సర్, బీపీ, షుగరు, కంటి పరీక్షలు నిర్వహించారు. బ్రెస్ట్ క్యాన్సర్, ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారికి ఉచితంగా మందులను అందజేశారు. అనంతరం డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యంగా ఉంటేనే విధులను సక్రమంగా నిర్వర్తిస్తారని, చిన్నపాటి అనారోగ్యానికి గురైనా వెంటనే వైద్యులను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు స్రవంతి, కార్తీక్, సత్యనారాయణ, సంధ్య, ప్రవీణ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్లు, ఆర్పీలు, ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

**కుటుంబ నియంత్రణపై అవగాహన అవసరం**

షాద్‌నగర్‌రూరల్: చిన్న కుటుంబంతోనే అభివృద్ధి సాధ్యమని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ముఖ్యకూడలి వరకు ప్రపంచ జనాభా దినోత్సవ ర్యాలీని నిర్వహించి మానవహారం చేపట్టారు. కుటుంబ నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. దేశ ఆర్థికాభివృద్ధిని కాపాడేందుకు ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించడం జరుగుతోందన్నారు. ప్రపంచ జనాభాలో భారత దేశం రెండవ స్థానంలో ఉందన్నారు. ప్రభుత్వం 1960 నుంచి కుటుంబ నియంత్రణ అమలు చేయడం జరుగుతుందని అన్నారు. చిన్న కుటుంబం చింతలేని కుటుబమని, ప్రతి ఒక్కరు కుటుంబ నియంత్రణ పాటించాలని అన్నారు. దేశ జనాభాను దృష్టిలో పెట్టుకొని ఇప్పుడు మేం ఇద్దరం మాకు ఒక్కరు ముద్దు ఇద్దరు వద్దు అనే నినాదంతో ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు స్రవంతి, రాఘవేందర్, సత్యనారాయణ, కార్తీక్, జగదీష్, సంధ్య, ప్రవీణ, బిందు, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, హెల్త్‌సూపర్‌వైజర్లు అమృత, శ్రీరామ్, చంద్రకళ, మహేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ రెడ్యానాయక్, సిబ్బంది రవి కుమార్, గౌస్, లింగం, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.